క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

సబ్సిడీ కంది విత్తనాల పంపిణీ



మల్యాలలో విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కింద కంది విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి షేక్షావలి తెలిపారు. మండలంలోని మల్యాల గ్రామానికి సంబంధించి ఎల్ఆర్జీ -52 రకం 4 క్వింటాళ్లు, ఎల్ఆర్జీ-105 రకం చెందిన కంది విత్తనాలు 4 క్వింటాళ్లు మంజూరయ్యాయని చెప్పారు. ఖరీఫ్‌లో కంది విత్తనాలు సాగు చేయాలనుకునే రైతులు గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయాధికారులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

కొత్తపల్లి: బుధవారం జరగవలసిన మండల సర్వసభ్య సమావేశం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా 12వ తేదీన జరగాల్సిన సమావేశం వాయిదా వేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని వివరించారు. సమావేశాన్ని ఈనెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి మండలంలోని అందరూ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న (ఏడు , ఎనిమిది, తొమ్మిది తరగతులు) సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సలీం బాషా ఓ ప్రకటనలో కోరారు. జూన్ 14వ తేదీ లోపు పాఠశాలలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 15న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు.

పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ సహకారం

పాములపాడు: పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ విమలమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 5 ఎకరాల్లోపు పొలం ఉండి, బావి, బోరు సౌకర్యం ఉన్న రైతులకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పొలం పాసుబుక్కు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, జాబ్ కార్డు జిరాక్స్ కాపీలతో గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌కు గానీ నేరుగా కార్యాలయంలో గాని సంప్రదించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పొలంలో మొక్కలు నాటిన నాటి నుంచి 3 సంవత్సరాల వరకు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు.

ఆన్‌లైన్‌లో రైతుల వివరాల నమోదు

వెలుగోడు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సభ్యత్వం కలిగిన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు సీఈఓ జంబులయ్య తెలిపారు. వెలుగోడు సహకార సంఘంలో సభ్యత్వం, లోన్ కలిగిన ప్రతి ఒక్కరూ తమ పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, పాన్ కార్డు, రెండు ఫొటోలు కార్యాలయంలో అందించాలని సూచించారు. సొసైటీలను కేంద్ర ప్రభుత్వం కంప్యూటరీకరణ చేస్తుండటంతో ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. సకాలంలో వివరాలు అందించని రైతులు తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని సీఈవో తెలిపారు.

విస్తారంగా వర్షాలు

- మే నెలలో సాధారణం కంటే అధిక వర్షపాతం
- జూన్‌లో ఇప్పటికే సాధారణానికి మించి వాన
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- చెరువులకు జలకళ
- అన్నదాతల హర్షం

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలో పది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల జోరుకు పొలాల్లో వర్షపునీరు నిలిచి ఉంది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మే నెలలో ఎండ తీవ్రత ఉన్నప్పటికీ అడపా దడపా వర్షాలు కురవగా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెల ప్రారంభంలోనే రికార్డు స్థాయిలో సాధారణ వర్షపాతానికి మించి వర్షం కురిసింది. దీంతో రైతన్నలు విత్తువేసేందుకు సిద్ధమయ్యారు.

వర్షపాతం వివరాలు..

మే 13వ తేదీ నుంచి ఆత్మకూరు డివిజన్‌లో పలు మార్లు వర్షాలు కురిశాయి. వర్షాలు కురిసిన తీరును పరిశీలిస్తే మే నెలలో సాధారణ వర్షపాతం 29 మి.మీ. కాగా, ఆ నెలలో 7వ తేదీన 49.2 మి.మీ., 8వ తేదీన 16.4 మి.మీ., 15న 15.8 మి.మీ., 18న 45.2 మి.మీ., 29వ తేదీన 0.8 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. మొత్తం 139.86 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెలలో సాధారణంగా 92.0 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటికే రికార్డుస్థాయిలో సాధారణ వర్షపాతం కంటే అధికంగా నమోదయ్యింది. ఈనెల 3వ తేదీన ఒక్కరోజే 84.2 మి.మీ., 4వ తేదీన 2.4 మి.మీ., 6వ తేదీన 17.8 మి.మీ., 7వ తేదీన 1.8 మి.మీ., 10వ తేదీన 14.4 మి..మీ. వర్షపాతం నమోదయ్యింది. మంగళవారం వేకువజామున వివిధ గ్రామాల్లో 6.9 మి.మీ. వర్షం కురిసింది. పొలాల్లో విత్తు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. కానీ పొలాలు ఆరితే విత్తు వేయాల్సి ఉంది. ఈ తరుణంలో ఆగకుండా వర్షాలు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



కొత్తపల్లి మండలం నందికుంట సమీపంలో పంటపొలాల్లో నిలిచిన వర్షపునీరు

పొంగి ప్రవహిస్తున్న వాగులు

వర్షాలు విస్తారంగా కురవడంతో మండలంలోని బవనాసి, సుద్దవాగు, రాళ్లవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే వర్షపునీరు అధికం కావడం వల్ల మండలంలోని కరివేన, ఇందిరేశ్వరం, కొత్తరామాపురం, నల్లకాల్వ, సిద్ధాపురం చెరువులకు కొద్దిపాటి వర్షపునీరు వచ్చి చేరింది. ఈ వర్షాలకు రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్లు, వృషభాలతో జోరుగా ఒట్టి సేద్యాలు చేయడంతోపాటు పొలాలను చదును చేసుకుంటున్నారు. ఇప్పటికే ఎరువులు చల్లుతున్నారు. ప్రస్తుతం పొలాలను విత్తుకునేందుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే వరుసగా వర్షాలు కురుస్తుండటంతో విత్తు వేస్తే మొలకలకు ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్నారు. వానలు తెరిపిస్తే విత్తు వేయాలని వేచిచూస్తున్నారు.

● పగిడ్యాలలో 9 మి.మీ. వర్షపాతం

పగిడ్యాల: మండల వ్యాప్తంగా నాలుగు రోజులుగా మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం 9 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. జూన్ మొదటి వారం నుంచే వర్షాలు ప్రారంభం కావడంతో ఖరీఫ్ సాగులో అన్నదాతలు, వ్యవసాయ కూలీలు బిజీబిజీగా ఉన్నారు. కురుస్తున్న వర్షాలకు విత్తనం విత్తుకునేందుకు అదును కావడం వలన రైతులు మొక్కజొన్న, మినుము, కంది, ఉల్లి, మిరప తదితర పంటల సాగుపై ఆసక్తిని చూపుతున్నారు.



పగిడ్యాల సమీపంలో మొక్కజొన్న విత్తనం నాటుతున్న వ్యవసాయ కూలీలు

రేపు పాఠశాలల పునఃప్రారంభం

నందికొట్కూరు: ఈ నెల 13వ తేదీన ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని మండల విద్యాశాఖ అధికారి ఫైజున్నీసాబేగం తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఈ నెల 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం కావాల్సి ఉండగా.. విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు 13కు వాయిదా వేయడం జరిగిందన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరుకావాలని సూచించారు.

మాతాశిశు సంరక్షణకు కృషి చేయాలి

గోస్పాడు: మాతాశిశు సంరక్షణకు కృషి చేయాలని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు నమోదు అయిన రోజు నుంచి ప్రసవం జరిగిన సంవత్సరం వరకు కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాతాశిశు సంరక్షణ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులకు రక్త, మూత్ర పరీక్షలతో పాటు మధుమేహం, హిమోగ్లోబిన్, రక్తపోటు వంటి నిర్ధారణ పరీక్షలు చేశారు. రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, సూపర్‌వైజర్ మద్దమ్మ, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి మెరుగుపర్చుకోండి



పొదుపు మహిళలకు సూచనలు ఇస్తున్న ఏపీఎం అంబమ్మ

జూపాడుబంగ్లా: పొదుపు సంఘాల్లోని మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని జీవనోపాధి మెరుగుపర్చుకోవాలని వైకేపీ ఏపీఎం అంబమ్మ సూచించారు. మంగళవారం జూపాడుబంగ్లా చామంతి గ్రామైఖ్యసంఘం ఆధ్వర్యంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ పొదుపు మహిళలకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలతో కుటీర పరిశ్రమలు, గొర్రెలు, బర్రెల పెంపకం వంటి జీవనోపాధులు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పథకంలో నడవాలన్నారు. తీసుకున్న అప్పులను క్రమం తప్పకుండా చెల్లించి బకాయిలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ నాయక్, గ్రామైఖ్యసంఘం లీడర్లు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించండి



పాములపాడులో పిల్లలతో అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పగిడ్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాములపాడు: 3 సంవత్సరాలు పూర్తైయిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత ప్రభావతి అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, వారి తల్లులతో మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు పోషక ఆహారంతో పాటు, ప్రాథమిక విద్య నేర్పించబడునని చెప్పారు. పీపీ 1, పీపీ 2 ఇంగ్లిష్ వర్క్ బుక్స్ రాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బాటపై ర్యాలీ

పగిడ్యాల: అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పగిడ్యాల, బీరవోలు, పాలమర్రి, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం, నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, ఆంజనేయనగర్ తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ 5 ఏళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేయించాలని కోరారు.

నీట్ స్కాంపై నిగ్గు తేల్చాలి

ఆత్మకూరు: జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ కుంభకోణంపై నిగ్గు తేల్చాలని ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు కె.దినేష్‌కుమార్, ఆత్మకూరు పట్టణ నాయకులు సాయి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డాక్టర్ ధనుంజయ భవన్ మీటింగ్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీట్ పరీక్షల నిర్వహణలో అసమర్థత ప్రదర్శిన చూపుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని (ఎన్‌టీఏ) రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో 67 మంది విద్యార్థులకు 720/720 మార్కులతో ఫస్ట్ ర్యాంకు రావడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. అలాగే అత్యధిక విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారని, ఈ స్థాయి మార్కులు రావడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నా యని చెప్పారు. సమావేశంలో ఆత్మకూరు పట్టణ నాయకులు దిలీప్, చందు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు సాయి



కర్రా బిళ్ల ఆడుతున్న పిల్లలు

■గ్రామీణ క్రీడ



పాములపాడు: నేటి తరం పిల్లలు ఆటపాటలను విడిచి సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. దీంతో వారి శారీరక, మానసిక వికాసం కుంటుపడటమే కాకుండా అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. కాగా గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు నేటికీ క్రీడలు ఆడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. మంగళవారం పాములపాడు శివారులో పలువురు పిల్లలు గ్రామీణ క్రీడ అయిన కర్రాబిళ్ల ఆడుతూ కనిపించారు. దీనిని కర్రా బిళ్ల, గూటి బిళ్ల అని, చిల్లం గోడె అని వివిధ ప్రాంతాల్లో పలు రకాల పేర్లతో పిలుస్తుంటారు. ఈ క్రీడతో పిల్లల్లో శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా మానసిక వికాసం కలుగుతుందని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈ క్రీడ నుంచే ఆంగ్లేయులు క్రికెట్ ఆటను కనిపెట్టారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, పాఠశాలలకు నేటితో సెలవులు ముగుస్తున్నాయి. ఇక విద్యార్థులు ఆటలకు సెలవు ఇచ్చి పాఠశాలలకు వెళ్లనున్నారు. ఏది ఏమైనా ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో సాంకేతికత విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, వీడియో గేమ్‌లకుఆదరణ ఎక్కువగా ఉన్న కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఈ క్రీడ పట్ల మక్కువ కనబరుస్తూ ప్రాచీన క్రీడలను ఆడుతుండటం గమనార్హం.

మహానందిలో భక్తజన సందడి

మహానంది: మహానందిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మంగళవారం రెండు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేలాది మంది భక్తులరాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓలు వై.మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు అంబటి శశిధర్‌రెడ్డి, నీలకంఠరాజులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

మహానంది: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో అమరావతికి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లనున్న నేపథ్యంలో మహానంది మండలంలోని గాజులపల్లె సమీపంలో ఉన్న ఆంజనేయపురం వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని ఈ చెక్‌పోస్టు వద్ద నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి, తాలూకా సీఐ దస్తగిరి బాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి అనుమతి ఉన్నవారిని మాత్రమే పంపించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం.

భగవద్గీతతో మానసిక ప్రశాంతత



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న సమితి సభ్యులు

ఓర్వకల్లు: మానసిక ఒత్తిడిని అధిగమించి ప్రశాంత జీవనం గడపడానికి భగవద్గీతను చదవడం అలవాటు చేసుకోవాలని మిడుతూరుకు చెందిన ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. మండలంలోని హెచ్ కొట్టాల, చెన్నశెట్టిపల్లె గ్రామాల్లో మంగళవారం ప్రబోధ సేవా సమితి సభ్యులు త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. సమితి సభ్యులు శ్రీనివాసులు, రాఘవేంద్ర, రవి, గోకారి, జగదీష్, సుజాత, హైమావతి, సుబ్బలక్ష్మి, రమణమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ఆళ్లగడ్డ: రూరల్ మండలం చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన షేక్ ఫకూర్‌బీ అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ నరసింహులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ ఫకూర్‌బీకి ఏడేళ్ల క్రితం చాగలమర్రి మండలం శెట్టివీడు గ్రామానికి చెందిన కట్టుబడి హుస్సేన్‌బాషాతో వివాహం జరిగింది. కొంత కాలంగా దంపతులు ఇద్దరూ గొడవ పడుతుండడంతో రెండు నెలల క్రితం ఫకూర్‌బీ పుట్టింటికి వచ్చింది. ఈ నెల 8వ తేదీ ఆరోగ్యం సరిగ్గాలేదని.. చాగలమర్రిలోని కేరళ ఆస్పత్రికి వెళ్లి చూయించుకుని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారిని విచారించినా ఆచూకి లభ్యం కాకపోవడంతో మంగళవారం ఫకూర్‌బీ అన్న ఫక్రుద్దీన్ స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

స్వయం ఉపాధిపై అవగాహన

పాణ్యం: మండల కేంద్రంలోని పొదుపు కార్యాలయంలో స్వయం ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్నట్లు ఏపీఎం ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎస్ఆర్ఎల్ఏఎం నుంచి వచ్చిన నీరజ్‌తో వివిధ రకాల ఆహార పదార్థాల తయారీపై పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలు, చిన్న తరహా పరిశ్రమలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఉపాధి అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో బాబురావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో కళాకారులు

మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా మహాదేవ్ కూచిపూడి నాట్య క్షేత్రం గుంటూరు వారిచే సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో విఘ్నం రాజం భజే, వినాయకకౌత్వం, త్రినేత్రం, భో.. శంభో తదితర గీతాలకు హారిణి, హేమ, వివిక్త, లాస్య, దుర్గా, పావని తదితరులు నృత్యం చేశారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



సంజీవనగర్ రామాలయంలో శ్రీవెంకటేశ్వరస్వామికి పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవా కార్యక్రమం చేపట్టారు. వడిబియ్యం సమర్పించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహా మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం అమ్మవారికి నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

సంజీవనగర్‌లో లక్ష్మీవెంకటేశ్వరస్వామికి

పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామికి ఉదయం శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అష్టాదళ పాదపద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా 108 బంగారు పుష్పాలచే అష్టోత్తర నామ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఎస్టీ పునరుద్ధరణపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరిస్తామంటూ రాజకీయ పార్టీల నాయకులు హామీలు ఇస్తున్నారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత వాల్మీకుల అంశాన్ని మరిచి పోతున్నారని, గెలిచిన పార్టీలు వాల్మీకుల అంశంపై నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. పునరుద్ధరణపై కొత్త ప్రభుత్వం ముందుకు సాగకపోతే వాల్మీకులు పునరాలోచన చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, జయరాం, మదనగోపాల్, శ్రీనివాసులు, కుమార్, బాలు, మల్లికార్జున, పరమేష్, నరసింహ పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సెంట్రల్): పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ...రానున్న వర్షాకాలంలో పశువులు ఎక్కువగా సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, ముందస్తుగా టీకాలు వేయించి వీటి నుంచి రక్షణ పొందాలన్నారు. వైద్యానికి మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మూగజీవాలకు పెద్ద వ్యాధులు సోకితే నిర్ధారణకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అలాగే దూరప్రాంతాల నుంచి పశువులను ఆస్పత్రికి నడిపించి తీసుకురాకుండా సంచార పశు వైద్యశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయా సేవల ద్వారా సత్వరమే పశువులకు వైద్యసేవలు అందుతుండటంతో గతంలో కన్నా ఇప్పుడు పశు మరణాలు తగ్గాయని వెల్లడించారు. ఆర్బీకేలలో లభించే గడ్డి విత్తనాలు నాటుకుని, తద్వారా లభించే పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తిని పొందాలని సూచించారు.

కుందూకు తగ్గిన వరదనీరు



కుందూనది బ్రిడ్జి వద్ద కొట్టుకొచ్చిన గుర్రపు డెక్క

ఉయ్యాలవాడ: కుందూలో మంగళవారం వరద నీటి ప్రవాహం తగ్గింది. వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి కుందూ నదికి భారీగా వరద నీరు చేరింది. ప్రమాదస్థాయిలో నీరు ప్రవహించింది. ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గింది. నదీ తీరం వెంట ఉన్న మండలంలోని 14 గ్రామాల రైతులు ఖరీఫ్‌లో వరి సాగు కోసం సమాయత్తమవుతున్నారు. కాగా ఎగువ ప్రాంతాల నుంచి భారీగా గుర్రపు డెక్క కొట్టుకొచ్చింది. గుర్రపుడెక్క ఉయ్యాలవాడ వద్దనున్న వంతెన సమీపంలో నిలిచి ప్రవాహానికి అడ్డుగా మారింది. కేసీ కెనాల్ అధికారులు చొరవ తీసుకుని గుర్రపు డెక్కను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.